# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-08-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

❖ నేపాల్‌లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రతి ఒక్కరినీ సురక్షితంగా రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడతామని హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.

❖ క్రీడల్లో భారత్‌ను అగ్రస్థానంలో నిలపడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు.

❖ బాలికలను సర్వైకల్ క్యాన్సర్ నుండి రక్షించేందుకు ఉద్దేశించిన హెచ్ పీవీ టీకా పంపిణీ రాష్ట్రంలో 98.47 శాతం పూర్తయిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

❖ రాష్ట్రంలో అత్యవసర సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని మంత్రి ఎస్. సవిత తెలిపారు.

=====================

నేపాల్ వరదల నేపథ్యంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత యాత్రికుల క్షేమం, సహాయక చర్యలపై ఈరోజు సమీక్ష నిర్వహించారు. విపత్తుల నిర్వహణ శాఖ అధికారులతో మాట్లాడిన ఆమె.. అక్కడి తాజా పరిస్థితిపై ఆరా తీశారు. నేపాల్‌లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారి వివరాలను వెంటనే సేకరించి ప్రతి ఒక్కరి భద్రత, క్షేమంపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఢిల్లీలోని ఏపీ భవన్, కేంద్ర విదేశాంగ శాఖ, నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయాలను నిరంతరం సంప్రదిస్తూ సమన్వయం కొనసాగించాలన్నారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాల సహాయ సహకారాలు అందించి.. వారిని క్షేమంగా స్వస్థలాలకు చేర్చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రతి ఒక్కరినీ సురక్షితంగా రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని మంత్రి అనిత స్పష్టం చేశారు.

=====================

క్రీడల్లో భారత్‌ను అగ్రస్థానంలో నిలపడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన 'ఖేలో ఇండియా సంవాద్ - ఖేల్ కీ బాత్, పీఎం కే సాథ్' కార్యక్రమంలో భాగంగా భీమవరంలో ఈరోజు 'వికసిత్ భారత్ యూత్ కనెక్ట్ స్పోర్ట్స్ ఎడిషన్' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... `ఖేలో ఇండియా`, `ఫిట్ ఇండియా`, `ఖేలో ఇండియా సంవాద్` వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులను వెలికితీస్తున్నామని అన్నారు. దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని విధంగా ఈ ఏడాది క్రీడల అభివృద్ధికి 4 వేల 400 కోట్ల రూపాయల బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని శ్రీనివాస వర్మ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

హెచ్ పీవీ టీకా పంపిణీ రాష్ట్ర వ్యాప్తంగా 98.47 శాతం పూర్తయిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారి నుంచి సంరక్షించే చర్యల్లో భాగంగా ఈ వ్యాక్సిన్ ను బాలికలకు ఉచితంగా అందచేస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది మార్చి నాటికి 14-15 సంవత్సరాల మధ్య వయస్కులైన బాలికలు 3 లక్షల 45 వేల 377 మంది ఉండగా.. ఇప్పటివరకు 3 లక్షల 40 వేల 108 మందికి వ్యాక్సిన్ ఇవ్వడం పూర్తయిందని, మిగిలిన 5 వేల 269 మందికి ఈ నెల 31లోగా వ్యాక్సిన్ అందిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున అవగాహన కల్పించడంతో అపోహలు తొలగి, తమ కుమార్తెలకు వ్యాక్సిన్ వేయించేందుకు తల్లిదండ్రులు ముందుకు వచ్చారని మంత్రి వివరించారు. కాగా.. వ్యాక్సిన్ పొందిన 3 లక్షల 40 వేల మంది బాలికలకు సంబంధించి ఎటువంటి రియాక్షన్ కేసులు నమోదు కాలేదని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్ బాబు తెలియజేశారు.

=====================

రాష్ట్రంలో అత్యవసర సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. పెనుకొండ పట్టణంలో 75 లక్షల రూపాయల విలువైన నూతన ఫైర్ ఇంజన్‌ను ఆమె ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా 25 నూతన ఫైర్ ఇంజన్లను ప్రారంభించడం శుభ పరిణామమని అన్నారు. ఆధునిక సాంకేతికతతో కూడిన ఈ ఫైర్ ఇంజన్ ద్వారా అగ్నిప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మరింత వేగంగా, సమర్థవంతంగా సేవలు అందించవచ్చన్నారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న కూటమి ప్రభుత్వం అత్యవసర సేవలను మరింత బలోపేతం చేస్తోందన్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి సూచించారు.

విరామం

=====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 137వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు రేపు సాయంత్రం వరకు పంపవచ్చు.

=====================

పల్నాడు జిల్లా బొప్పూడిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో 10 కోట్ల 99 లక్షల రూపాయల ఖర్చుతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఈరోజు శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ఆలయంలో గరుడ వాహనం ఏర్పాటు, పుష్కరిణి శుభ్రపరిచే పనులు, కొండపైకి రహదారి నిర్మాణం, మెట్ల మార్గం పక్క కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా గవర్నర్... ఆలయ మెట్ల మార్గం వద్ద మొక్క నాటి,

అభివృద్ధి పనులకు సంబంధించిన పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ కృష్ణ మోహన్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయులు, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల తదితరులు పాల్గొన్నారు.

======================

మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి భరోసా ఇచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలో మెగా డీఎస్సీలో ఎంపికైన ఉంగరాల కవిత, కోట ప్రవీణ్‌కుమార్ లను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు సాధించారని అన్నారు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియపై కనీస అవగాహన లేకుండా కొత్తగా ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులను కొందరు గందరగోళానికి గురిచేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులను విదేశాలకు పంపించి శిక్షణ ఇప్పిస్తూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

======================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ (APSSDC) ఆధ్వర్యంలో ఈరోజు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలోని గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు 103 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా... 37 మందికి వివిధ కంపెనీలలో ఉద్యోగాలు లభించాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ  సీతా మహాలక్ష్మి అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. యువత తమ నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తే దూర ప్రాంతాలకు వెళ్ళడానికి సిద్ధం కావాలన్నారు.

======================

పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఈరోజు రాజమహేంద్రవరంలో జరిగిన దిశా సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, సాగునీరు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్య రంగాలు, గోదావరి పుష్కర పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్య తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి.. ఆయా శాఖల పరిధిలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ... ప్రతి 4 నెలలకు ఒకసారి ఎంపీల ఆధ్వర్యంలో దిశ సమావేశం నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును సమీక్షిస్తున్నామని చెప్పారు. వచ్చే నెల నుండి పుష్కరాల పనులు ప్రారంభించి.. వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని వివరించారు.

======================
======================